సాక్షి
కర్నూలు
గురువారం ׀ 22 ׀ ఫిబ్రవరి ׀ 2024



కేసీకి నీటి విడుదల

గూడూరు: కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా బుధవారం హైదరాబాద్‌కు చెందిన జ్యోతిశేఖర్, బృందం వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమం మల్లన్న భక్తులను ఆకట్టుకుంది.



యథేచ్ఛగా జల చౌర్యం

గండ్రేరు జలాశయం నుంచి నీటి చౌర్యం యథేచ్ఛగా సాగుతోంది. కొద్ది రోజులుగా ఈ తంతు సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తాగు నీటి సమస్య తలెత్తే ప్రమాదం నెలకొంది. 8లో▸

న్యూస్‌రీల్

అభ్యర్థుల ఖర్చుపై నిఘా వేయాలి



శిక్షణకు హాజరైన అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు, అకౌంట్ ఆఫీసరు

కర్నూలు(సెంట్రల్): వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాలపై నిఘా వేయాలని వ్యయ నిర్వహణ నోడల్ ఆఫీసర్లు రమేష్‌బాబు, రామాంజనేయులు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా పరిశ్రమల కేంద్రంలో అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు, అకౌంట్ ఆఫీసర్లకు ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి అభ్యర్థి.. రోజూ చేసే ఖర్చులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో తెప్పించుకోవాలన్నారు. చేసిన ఖర్చులను సమర్పించకపోతే సంబంధిత అభ్యర్థుల అభ్యర్థిత్వాలు రద్దు అవుతాయన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మారుతి ప్రసాదు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్‌ఎం సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

కర్నూలు సిటీ: డీఎస్సీ–2008 నోటిఫికేషన్‌లో ఉద్యోగాలకు అర్హత సాధించిన నలుగురు అభ్యర్థులకు కనీస వేతన స్కేల్ విధానంలో బుధవారం ఉద్యోగాలు ఇచ్చారు. నాడు పోస్టుల భర్తీ సమయంలో ఖాళీలు లేకపోవడంతో వారికి ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్రస్తుతం కోసిగి, కౌతాళంలో ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిలో ఆ నలుగురు అభ్యర్థులను కనీస వేతన స్కేల్ విధానంలో నియమిస్తూ డీఈఓ కె. శామ్యూల్ నియామక పత్రాలు అందజేశారు.

2024-25లో రూ.15,131 కోట్ల రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా రూ.15131 కోట్ల వరకు రుణాలు పంపిణీ చేసే అవకాశం ఉందని నాబార్డు అంచనా వేసింది. ఈ మేరకు నాబార్డు అధికారులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ (పీఎల్‌పీ) ఖరారు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక రూ.12,320 కోట్లతో రూపొందించారు. ఈసారి అదనంగా రూ.2,811 కోట్లతో ప్రొటెన్షియల్ లింక్డ్ ప్లాన్‌ను సిద్ధ చేశారు. సెక్టారు వారీగా రుణాల పంపిణీ సామర్థ్యాన్ని నాబార్డు నిర్ధారించింది. వ్యవసాయ రంగానికి రూ.7,156 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రూ.2,060 కోట్లు, ఎక్స్‌పోర్టు, విద్య, హౌసింగ్ రుణాలు రూ.1,981 కోట్లు, మౌలిక సదుపాయాలు, రెనవబుల్ ఎనర్జీ (పునరుత్పాదక శక్తి) రుణాలు రూ.3,934 కోట్లు ప్రకారం పంపిణీ చేసే అవకాశం ఉన్నట్లు నాబార్డు అధికారులు పేర్కొంటున్నారు.

నేడు వైఎస్ఆర్ జలకళ, వాటర్‌షెడ్‌లపై ఓపెన్ ఫోరం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ జలకళ కింద నంద్యాల జిల్లాలో వేసిన బోర్లపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలపై ఈ నెల 22న ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. జిల్లాలో 2022 జూలై 1 నుంచి 2022 ఫిబ్రవరి 22 వరకు మొత్తంగా 2138 బోర్లు వేసి పూర్తి పేమెంట్ చేశారు. అదే విధంగా కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని శకునాల, పోతుగల్ పీఎంకేఎస్‌వై వాటర్‌షెడ్ పనులపై కూడా ఫోరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శకునాల ప్రాజెక్టులో రూ.5.43 కోట్లతో 1179 పనులు పూర్తి చేశారు. పోతుగల్ ప్రాజెక్టులో రూ.2.39 కోట్లతో 548 వర్కులు పూర్తి చేశారు. కర్నూలు శివారులోని జగన్నాథగట్టులోని జిల్లా నీటియాజమాన్య సంస్థ శిక్షణ కేంద్రంలో ఓపెన్ ఫోరం జరుగుతుందని ఆయన తెలిపారు.

పెరిగిన వాము ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము ధరలు మరింత పెరిగాయి. దీంతో ఆ పంట సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వాముతో పాటు వేరుశనగ, కందులు, మొక్కజొన్న పంటలకు కూడా ధరలు ఆశాజనకంగా లభిస్తుండటం విశేషం. మంగళవారం మార్కెట్‌కు వాము దాదాపు 1,367 క్వింటాళ్లు రాగా కనిష్ట ధర రూ.507, గరిష్ట ధర రూ.28,010, సగటు ధర రూ.19,019 ప్రకారం లభించింది. కందుల ధరలు మళ్లీ రూ.10 వేల మార్కు దాటాయి. 494 క్వింటాళ్ల కందులు రాగా గరిష్ట ధర రూ.10,021 లభించింది.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

- ఉమ్మడి జిల్లాలో రూ.830 కోట్లతో జేజేఎం పనులు
- తాగునీటికి జెడ్పీ నుంచి రూ.3.80 కోట్లు వెచ్చించాం
- ఏయేటికాయేడు పెరుగుతున్న జెడ్పీ ఆదాయం
- ముందస్తు చర్యల్లో భాగంగా జీడీపీలో 2 టీఎంసీల నీరు
- ఏపీ టూరిజంకు అద్దె ప్రాతిపదికన పాత జెడ్పీ భవనం
- హాజరైన మంత్రి బుగ్గన, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ సృజన తదితరులు

కర్నూలు(అర్బన్): వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన ఐఏబీ సమావేశంలో తీసుకున్న ముందస్తు నిర్ణయాల వల్ల గోరుకల్లు రిజర్వాయర్‌లో 11 టీఎంసీల నీటిని నిల్వ చేశామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీటితో డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని 68 చెరువులను నింపడం వల్ల ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టులో కూడా ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయడం వల్ల కోడుమూరుతో పాటు హంద్రీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య తగ్గిందన్నారు. జీడీపీలో మొత్తం 2 టీఎంసీల నీరు నిల్వ చేయగా, ఇప్పటి వరకు 0.5 టీఎంసీ వినియోగించామన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, నందికొట్కూరు ఎమ్మెల్యే టి.ఆర్థర్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.సృజన, డాక్టర్ కె.శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఏపీ సుబ్బారెడ్డితో పాటు రెండు జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

రూ.830 కోట్లతో జేజేఎం పనులు

ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.830 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చెప్పారు. ప్యాకేజీల ప్రకారం టెండర్లు పిలవడం వల్ల జాప్యం జరుగుతోందని, వ్యక్తిగతంగా టెండర్లు పిలవాలని జెడ్పీ సమావేశాల్లో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపడం వల్ల ప్రస్తుతం వ్యక్తిగత టెండర్లను ఆహ్వానించడంతో పనులు వేగవంతం అయ్యాయన్నారు. నాలుగు సంవత్సరాలు వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం వల్ల నీటి సమస్య తలెత్తలేదని, ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వల్ల ఉత్పన్నమయ్యే నీటి సమస్యను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే జిల్లా పరిషత్ నుంచి రూ.3.80 కోట్లను తాగునీటి పనులకు వెచ్చించామన్నారు.

పెరుగుతున్న జెడ్పీ ఆదాయం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ ఆదాయం అంతంతమాత్రంగానే ఉందని, 2019–20 నుంచి ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో జిల్లా పరిషత్ ఆదాయం పెరుగుతోందని చైర్మన్ పాపిరెడ్డి చెప్పారు. 2014–15 నుంచి 2018–19 వరకు చూస్తే రూ.4.11 కోట్లు మాత్రమే ఉందని, 2019–20 నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం జనవరి నెల వరకు చూస్తే ఆదాయం రూ.11.14 కోట్లకు చేరిందన్నారు. జిల్లా పరిషత్ ఆదాయాన్ని పెంచుకునే ప్రక్రియలో భాగంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పాత జెడ్పీ భవనాన్ని



సమావేశానికి హాజరైన ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే ఆర్థర్, ఎమ్మెల్సీ మధుసూదన్, జెడ్పీటీసీలు, అధికారులు

ఏపీ టూరిజంకు కన్‌స్ట్రక్షన్ ఏరియా ఒక చదరపు అడుగు రూ.30, ఖాళీ ప్రదేశం ఒక చదరపు అడుగు రూ.15 ప్రకారం అద్దెకు ఇచ్చేందుకు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదం మేరకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

పంచాయతీ తీర్మానం ఇస్తే పనులు చేపట్టేందుకు అవకాశం

జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో రూ.14 లక్షల జెడ్పీ, మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ తీర్మానాలు ఇప్పించాలని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మండలంలోని తర్తూరు గ్రామంలో రంగనాథస్వామి జాతరకు మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. ప్రస్తుత వేసవిలో జాతరకు వచ్చే భక్తులకు తాగునీటిని పుష్కలంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

సహకార రుణాలను రీ షెడ్యూల్ చేయించండి

ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మెజారిటీ రైతులు తమ పరిధిలోని కోఆపరేటివ్ బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నారు. బ్యాంకు నిబంధనలకు కొంత మినహాయింపు ఇచ్చి రుణాలను రీ షెడ్యూల్ చేయించాలి. అలాగే ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలి. జేజేఎం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన పనుల వేగాన్ని పెంచాలి.

– టి.ఆర్థర్, ఎమ్మెల్యే, నందికొట్కూరు

మంత్రి, ప్రజా ప్రతినిధులకు సన్మానం

జిల్లా పరిషత్ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించేందుకు విశేష కృషి చేయడంతో పాటు విలువైన సలహాలు, సూచనలు అందించిన రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఘనంగా సన్మానించారు. అలాగే కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్‌ను శాలువా కప్పి, మెమెంటోతో ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు కోరారు. జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, రంగనాథ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, సునీత, బుజ్జమ్మ తదితరులు తమ మండలాల్లో నెలకొన్న నీటి సమస్యను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయాలని కోరారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి మద్దయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు బి.నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, డీఆర్‌డీఏ పీడీలు సలీంబాషా, శ్రీధర్‌రెడ్డి, డీపీఓలు టి.నాగరాజునాయుడు, మంజులవాణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు ఆర్.నాగరాజు, ఎస్.శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీలు సిద్ధలింగమూర్తి, వెంకటసుబ్బయ్య, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, పీఆర్ ఎస్ఈ కె.సుబ్రమణ్యం, డీఈఓలు శామ్యూల్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీనరేజ్ గ్రాంట్‌పై మంత్రి బుగ్గన ఆరా

జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన సమయంలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన కలుగుజేసుకుని సీనరేజ్ గ్రాంట్‌పై వివరణ కోరారు. 2022–23వ ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రాబడుల ఆధారంగా 2023–24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్‌లో రూ.4.54 కోట్లను, 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలో రూ.4.75 కోట్లను చూపించడం పట్ల ఆయన మైనింగ్ డీడీ రాజశేఖర్‌ను ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాకు కనీసం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల సీనరేజ్ గ్రాంట్ రావాల్సి ఉందన్నారు. మరోసారి పరిశీలిస్తే స్థానిక సంస్థలకు సీనరేజ్ గ్రాంట్ పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రెండేళ్లుగా నిలిచిపోయిన శాండ్ సెస్‌ను కూడా పరిశీలించాలన్నారు.

24 వరకు పోలింగ్ స్టేషన్ల మార్పునకు అవకాశం

- 18 ఏళ్లు నిండిన వారందరితో ఓటరుగా నమోదు చేయించాలి
- రాజకీయ పార్టీలకు సూచించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ స్టేషన్ల మార్పునకు ఈనెల 24వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్న పోలింగ్ స్టేషన్లను మార్చుకోవడానికి అవకాశం ఉంటుందని, 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న స్టేషన్లను కూడా విభజించుకొని రెండుగా చేసుకోవచ్చునన్నారు. రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తగిన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో తుది ఓటరుజాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. 80 సంవత్సరాలు నిండిన ఓటర్లు ఇంటి దగ్గరే ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి 12 డి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. తుది ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలంటే జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నుంచి పీటీ సాయిప్రదీప్, టీడీపీ నుంచి ఎల్వీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నుంచి కె.పుల్లారెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

కుప్పం నుంచి పారిపోయేందుకు ‘బాబు’ సిద్ధం

- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి వ్యాఖ్యలే అందుకు నిదర్శనం
- వైఎస్ జగన్ దెబ్బకు రాజ్యసభలో టీడీపీ ఖాళీ
- వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు (టౌన్): ‘ఓడిపోతాననే భయంతో చంద్రబాబు కుప్పం నుంచి పోటీ చేయకుండా పారిపోయేందుకు సిద్ధమయ్యాడు. బాబుకు వయోభారం పెరిగిందని విశ్రాంతి కావాలని ఆయన సతీమణి భువనేశ్వరి కుప్పం పర్యటనలో పేర్కొనడమే అందుకు నిదర్శనమని’ వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. బుధవారం సాయంత్రం బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 35 సంవత్సరాలుగా కుప్పం ప్రజలు చంద్రబాబును గెలిపించినా ఆయన వారికి ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడ పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఇంటింటికీ సంక్షేమం అందించారన్నారు. కుప్పంను మున్సిపాలిటీ చేయడమే కాక రెవెన్యూ డివిజన్‌గా మార్చారన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా ఆ ప్రాంతానికి తాగు, సాగు నీరు అందించారన్నారు. ఇప్పటికే జరిగిన స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచారన్నారు. ఇక తాను కూడా ఓడిపోతాననే భయంతో బాబు కుప్పంలో ఇల్లు కట్టుకుంటున్నారన్నారు. ఆయన ఎన్ని జిమ్మిక్కులు చేసినా వైఎస్ఆర్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాప్తాడులో సిద్ధం సభకు 12 లక్షల మంది కార్యకర్తలు రావడం చూసి ప్రతిపక్ష పార్టీలు భయపడిపోతున్నాయన్నారు.

ఓటమి భయంతోనే పొత్తులు

వైఎస్ కాంగ్రెస్ పార్టీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు పొత్తులకు పాకులాడుతున్నారని బీవై రామయ్య విమర్శించారు. బాబుకు ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. అందుకు ఆయన ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకుంటారన్నారు. భవిష్యత్తులో జనసేన అధినేత పవన్‌కు కూడా వెన్నుపోటు తప్పదన్నారు. ఇప్పటి వరకు ఏపీలో పక్కా ఇళ్లు లేని బాబు, పవన్‌లను రాష్ట్ర ప్రజలు విశ్వసించరన్నారు. వైఎస్ జగన్ దెబ్బకు రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అయిందన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూడా ఆ పార్టీ గల్లంతు అవుతుందన్నారు. సమావేశంలో ఏపీ ఐడీసీ డైరెక్టర్ సత్యం యాదవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్, బీసీ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

దేదీప్యమానం..మహాకుంభాభిషేకం

- ఇలకైలాసంలో సంప్రదాయబద్ధంగా క్రతువులు
- కంచి, శ్రీశైల జగద్గురు, పుష్పగిరి పీఠాధిపతులతో శాస్త్రోక్తంగా పూజలు
- శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేకం
- పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ దంపతులు



శివాజీ గోపురంపైకి కలశాలను తీసుకెళ్తున్న దృశ్యం



శివాజీ గోపురానికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న శ్రీశైల జగద్గురు పీఠాధిపతి, కాశీ పీఠాధిపతి

శ్రీశైలం టెంపుల్: ఇలకై లాసం శ్రీగిరిలో మహాకుంభాభిషేకం దేదీప్యమానంగా సాగింది. పీఠాధిపతులు ఉభయ ఆలయ ప్రాంగణంలోని గర్భాలయ, ఉపాలయాల విమాన శిఖరాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ సంప్రదాయబద్ధంగా జరిపించారు. శివనామస్మరణల మధ్య శుభముహూర్తంలో జరిగిన ఈ మహోత్సవాన్ని భక్తజనం కనులారా తిలకించి పరవశించిపోయారు. ఈనెల 16 నుంచి జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవాల చివరి రోజు బుధవారం కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ మహాస్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డా.చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి, కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు శాంతి, పౌష్టిక హోమాలు, మహాపూర్ణాహుతి, పునరుద్ధరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠలు, శివలింగ–నందీశ్వరుల ప్రతిష్ఠలు, శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక సంబంధిత పూజాదికాలు జరిపారు. అనంతరం ఉభయ ఆలయాల గర్భాలయ విమానాలకు, గోపురాలకు, మూల మూర్తులకు, ఇతర దేవతామూర్తులకు మహాకుంభాభిషేక క్రతువులు పూర్తి చేశారు. అవభృథం, జగద్గురువులకు గురువందనం, మహదాశీర్వచనం, వేదసభ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

45 ఆలయ శిఖరాలకు కుంభాభిషేకం

ప్రధాన ఆలయంలోని స్వామి, అమ్మవారి గర్భాలయాలు, నాలుగు దిక్కుల్లో ఉన్న నాలుగు ప్రధాన గోపురాలు, అమ్మవారి ద్వారగోపురం, ఆలయ ప్రాంగణంలోని అన్ని ఉపాలయాలు, పరివార ఆలయాల్లో కుంభాభిషేకం జరిపించారు. అలాగే క్షేత్రంలోని గంగాధర మండపం, ఆరామవీరేశ్వరాలయం, అంకాళమ్మ ఆలయం, నందిగుడి, బయలు వీరభద్రస్వామి ఆలయం, పాతాళగంగ మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయం, పాతాళేశ్వర ఆలయం, గంగాసదన్ వద్ద గణపతి ఆలయం, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, పంచమఠాలలో కుంభాభిషేకం జరిపించారు. సాక్షిగణపతి, హటకేశ్వరం, శిఖరేశ్వరం, ఇష్టకామేశ్వరి ఆలయంలో కూడా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఏకకాలంలో 45 ఆలయాల్లో 95 కలశాలతో ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. శివాజీ గోపుర సువర్ణ కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేకాన్ని శ్రీశైల జగద్గురు, కాశీ పీఠాధిపతులు జరిపించారు. మల్లికార్జున స్వామి గర్భాలయ విమాన గోపురానికి కంచి పీఠాధిపతి, భ్రమరాంబాదేవి గర్భాలయ విమాన శిఖరానికి పుష్పగిరి పీఠాధిపతి కుంభాభిషేకాన్ని నిర్వహించారు. కాగా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే మహాకుంభాభిషేకం శ్రీశైలంలో 2006లో జరిగింది.

శివనామస్మరణతో మారుమోగిన శ్రీగిరి

మహాకుంభాభిషేక మహోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలాగే క్షేత్రపరిధిలో పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. శుభముహూర్తంలో మహాకుంభాభిషేక క్రతువులు వీక్షించిన భక్తుల హరోం హర శంకరా, ఓం నమఃశివాయ స్మరణలతో క్షేత్రం మారుమోగింది. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర దేవదాయశాఖ ప్రత్యేక కార్యదర్శి కరికాల్ వళవన్, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ఈఓ డి.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సెపక్‌తక్రా పోటీలు

కర్నూలు (టౌన్): ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్ తక్రా పురుషుల టోర్నమెంట్‌ను వచ్చే నెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం వర్సిటీలోని తన చాంబర్‌లో వీసీ మాట్లాడారు. ఆర్‌యూలో ప్రతిష్టాత్మక టోర్నమెంటు నిర్వహిస్తున్నందుకు న్యూఢిల్లీకి చెందిన అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 30 విశ్వవిద్యాలయాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయి ఈవెంట్ నిర్వహించడం ఇది తొలిసారి అని చెప్పారు. ఐదురోజుల పాటు జరిగే పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. అంకన్న, యూనివర్సిటీ స్పోర్ట్స్ కో– ఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ కళ్యాణ్ కుమార్, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

క్లుప్తంగా

16 పురుగు మందుల్లో నాణ్యత లోపం

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ కంపెనీలకు చెందిన పురుగు మందుల్లో నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి మండల వ్యవసాయ అధికారులు 954 పురుగు మందుల శ్యాంపుల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపారు. ఇందులో 16 శ్యాంపుల్స్ నాణ్యత లోపం ఉన్నట్లు తేలింది. బీఆర్ అగ్రో టెక్ లిమిటెడ్‌కు చెందిన టెబుకొనజోల్ 6.7 శాతం, డబ్ల్యూ/ డబ్ల్యూ +కాప్టాన్ 26.9 శాతం(పీటీసీబీసీ 23031),అవేంటో అగ్రో కెమికల్స్‌కు చెందిన థియామెతామిక్స్ 12.6 శాతం+ లాంబ్డా సైహలోత్రిన్ ఎస్, క్లోరోఫైరిపాస్ 50 శాతం ఇసీ (ఏఏసీ 007, ఏఏసీ 015) మల్టీకేర్ అగ్రిటెక్‌కు చెందిన అజాడిరాక్టిన్ 0.03 ఇసీ (ఎంఏటీ 366), హెలెనా ఇండస్ట్రీస్‌కు చెందిన స్పినెటోరం 11.7 శాతం ఇసీ (22ఎఫ్ 2078 ఈఎఫ్0), ట్రాఫికల్ అగ్రో సిస్టమ్ ఇండియాకు చెందిన క్లోరిఫైరిపాస్ 50 శాతం ఇసీ, ప్రొఫెనోపాస్ 40 శాతం+సైపర్ మెత్రిన్ 4 శాతం ఇసీ (టీపీసీఎఫ్ 230036, టీపీసీహెచ్ 220029), నిచినో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రొఫెనోపాస్ 40 శాతం+సైపర్ మెత్రిన్ 4 శాతం ఇసీ (బి1003), మేఘమణి ఆర్గానిక్ లిమిటెడ్‌కు చెందిన ప్రొఫెనోపాస్ 40 శాతం+సైపర్ మెత్రిన్ 4 శాతం ఇసీ (22/పి/44), భారత్ పేస్ట్ కెమ్ లిమిటెడ్‌కు చెందిన ఎసిఫేట్ 75 శాతం ఎస్‌పీ(001), అగ్రివిన్ క్రాప్‌కు చెందిన ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం, ఎస్‌జీ దైహిక క్రిమి(2023–06), కేర్ భారత్ పెస్ట్ కెమికల్స్ లిమిటెడ్‌కు చెందిన మోనోక్రోటోఫాస్ 36 శాతం ఎస్ఎల్ (001), బేయర్ క్రాప్‌సైన్స్‌కు చెందిన టెబుకొనజోల్ 50 శాతం +ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్ 25 శాతం డబ్ల్యూజి(ఎస్‌వైఎన్ ఏటీ 22023), అను ప్రొడక్ట్ లిమిటెడ్‌కు చెందిన ప్రొఫెనోపాస్ 40 శాతం, సైపర్‌మెత్రిన్ 4 శాతం ఇసీ (ఎప్ఏపీ 19040), గౌతమి కెమికల్స్, పెస్టిసైడ్‌కు చెందిన క్లోరిఫైరిపాస్ 10 శాతం జీఆర్(02), సుదర్శన్ బయోక్రాప్ సైన్స్‌కు చెందిన కార్బోఫ్యూరాన్ 3శాతం, సీజీ (ఎస్‌బీసీఎస్ 686) పురుగు మందుల్లో నాణ్యత లోపం ఉన్నట్లు ల్యాబ్ నుంచి రిపోర్టులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అక్రమ మద్యం రవాణాపై నిఘా



మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా జిల్లాలోకి మద్యం రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ అన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యాన్ని బుధవారం సాయంత్రం మొలగవల్లి రోడ్డులో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూరు సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 47 కేసుల్లో పట్టుబడిన 473 లీటర్ల కర్ణాటక మద్యం, 9 కేసుల్లో పట్టుడిన 60 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. వీటి విలువ రూ.1.75 లక్షలు ఉంటుందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్లమడికి, క్షేత్రగుడి చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సెబ్ సీఐ సోమశేఖర్, సిబ్బంది చెన్నయ్య, రామలింగమ్మ పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీలో త్వరలో పదోన్నతులు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థలో పని చేస్తున్న అన్ని స్థాయిల ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు కల్పించనున్నట్లు కడప జోనల్ చైర్మన్ ఎం.మంజుల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్లు, డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ కడప జోనల్ పరిధిలోని పాత బస్సుల స్థానంలో కొత్తవి కొనుగోలుకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆర్టీసీలో పని చేస్తూ చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగస్తుల వారసులకు త్వరలోనే ఉద్యోగాలు ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏళ్లనాటి ఉద్యోగుల కల సాకారం చేసిందని, 2020, జనవరి 1న ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో రూ.6వేల కోట్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఉద్యోగులందరి సహకారంతో లాభాల్లోకి తీసుకొచ్చామన్నారు.

యువికా.. విజ్ఞాన వేదిక

- గ్రామీణులకు ప్రాధాన్యం
- దరఖాస్తుకు 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- రిజిస్ట్రేషన్‌కు మార్చి 20 వరకు గడువు
- జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 15 నుంచి 26 వరకు శిక్షణ
- యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు చక్కని అవకాశం
- ఎంపికైన విద్యార్థులకు ఏడు చోట్ల శిక్షణా కేంద్రాలు




ట్యాబ్‌లు చూపుతున్న 9వ తరగతి విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): అంతరిక్ష విజ్ఞానం, స్పేస్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానం కల్పించేందుకు యువికా–2024 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు చక్కని అవకాశం కల్పించింది. యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) పేరిట అర్హత కలిగిన విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 15 నుంచి 28వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. ఎంపికైన వారు శిక్షణకు హాజరయ్యేందుకు భోజన, వసతి, రవాణా ఖర్చులను ఇస్రో భరిస్తుంది. ఎంపికై న విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలను వివరిస్తారు.

ఏడు శిక్షణ కేంద్రాల్లో..

విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రాల్లో ఈ శిక్షణ ఇస్తారు.



యువికా లోగో

యువికా ముఖ్యమైన తేదీలు..

రిజిస్ట్రేషన్ ప్రారంభం :	ఫిబ్రవరి 22
తుది గడువు	: మార్చి 20
మొదటి విడత జాబితా విడుదల :	మార్చి 28
రెండో విడత జాబితా విడుదల :	ఏప్రిల్ 4
ఎంపికైన విద్యార్థులు రిపోర్టింగ్ చేయాల్సిన తేదీ	: మే 12
యువికా ప్రోగ్రామ్	: మే 13, 14

దరఖాస్తు చేసుకోవాలిలా..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.

- హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్.జీఓవీ.ఇన్ లేదా యువికా.

చక్కని అవకాశం



విద్యార్థులు ప్రతిభ కనబర్చడానికి, వారు కన్న కలలను నెరవేర్చుకోవడానికి యువికా ఒక చక్కని అవకాశం. దీనిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించాలి. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– కేవీ సుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్

విద్యార్థులను ప్రోత్సహించాలి



యువికాకు అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి. శాస్త్రవేత్తలు కావాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించాలి. ప్రశ్నించే తత్వమే ప్రయోగాలకు, శాస్త్రవేత్తలు కావడానికి కారణమవుతుంది. డీవైఈఓలు, జిల్లా సైన్స్ అధికారులు, సైన్స్ టీచర్లు శ్రద్ధ తీసుకుని అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలి.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

టీడీపీ నేత భార్య చెప్పుతో దాడి

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆటోడ్రైవర్
- పది రోజుల చికిత్సతో కోలుకోలేక మృతి

బొమ్మలసత్రం: టీడీపీ నేత భార్య చెప్పుతో కొట్టిందనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ ఆటో డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. వివరాలివీ.. నంద్యాల మండలం బాబాగనర్ గ్రామానికి చెందిన ఓబులేసు ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 12న నూనెపల్లి సర్కిల్‌లో ఒక రోగిని పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు బాడుగ కుదుర్చుకున్నాడు. ఆసుపత్రి చుట్టుపక్కల మరికొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు ఉండటంతో కాస్త రద్దీగా ఉంటుంది. ఓబులేసు ఆటోలో తీసుకొచ్చిన రోగి ఆటోలో నుంచి కిందకు దిగేందుకు కాస్త సమయం తీసుకున్నాడు. అంతలో టీడీపీ నేత, మాజీమంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి సమీప బంధువు శివనాగిరెడ్డి భార్య శివానందమ్మ కారులో వచ్చింది. కారు డ్రైవర్ హారన్ కొట్టడంతో ఆటోలో నుంచి రోగి దిగుతున్నాడని, ఒక్క నిమిషం వేచి ఉండాల్సిందిగా ఓబులేసు చెప్పాడు. ఇంతలో శివానందమ్మ ఆగ్రహంతో ఊగిపోయి కారులో నుంచి దిగి ఆటో వద్దకు వెళ్లి ఓబులేసును దుర్భాషలాడింది. ఓబులేసు ఆమెకు సర్ది చెబుతున్నా వినకుండా తన కాలి చెప్పుతో ఓబులేసుపై దాడి చేసింది. అవమానంతో ఓబులేసు సమీపంలోని ఎరువుల దుకాణంలో పురుగుల మందు డబ్బా కొనుగోలు చేసి అవమానం జరిగినచోటే సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఓబులేసును స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. బాధితుని కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు ఇదివరకే కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చలపతి తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

మాతృభాషను మరువకూడదు

- క్లస్టర్ యూనివర్సిటీ వీసీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు సిటీ: మాతృభాషలో సర్వ విజ్ఞానం ఉంటుందని, ఈ విషయాన్ని ఏ ఒక్కరూ మరువకూడదని క్లస్టర్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో తెలుగు శాఖ నరసం, తెలుగు భాష వికాస ఉద్యమం సాహితీ సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ తొలుత తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన అభివృద్ధికి, ఉపాధికి ఆంగ్లం వంటి ఇతర భాషలు అవసరమే అన్నారు. అయితే, అదే సమయంలో మాతృభాష తెలుగును విస్మరించరాదన్నారు, అమ్మ భాషకు విశేషమైన భావ వ్యక్తీకరణ సామర్థ్యం ఉంటుందన్నారు. సభాధ్యక్షుడు, ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ అనేక యాసలు, సామెతలు, జాతీయాలు కలిగిన మన తెలుగు భాషను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు తమ పాలనలో మాతృ భాషను వాడితే ప్రజలకు చాలా మేలు జరుగుతుందన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ ఎన్నో దేశాలు తమ మాతృభాషతోనే అభివృద్ధి చెందాయన్నారు. జేఎస్ఆర్‌కే శర్మ, నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ జాతి ఉనికికి మాతృ భాష ఆధారం అన్నారు. అనంతరం విద్యార్థులకు వకృత్వపు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు డిగ్రీ, ఇంటర్ స్థాయిలో పది మందికి అందజేశారు. ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బసవరాజు సుబ్బరాయుడు తెలుగు పాటలను ఆలపించిన తీరు ఆహుతులను ఆకట్టుకుంది. అలాగే మాంటిస్సోరి, కేవీఆర్ విద్యార్థులు సభను నృత్య గానాలతో అలరింపజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దండిపోయిన పార్వతి దేవి, డాక్టర్ జయలక్ష్మి నాయుడు, ప్రసిద్ధ రచయిత అజీజ్ షేక్షావలి, శాంతి సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు జ్యోతిర్మయి, డాక్టర్ లత జయసుశీల, డాక్టర్ నాగమ్మ, మణికంత జయలక్ష్మి, విజయలక్ష్మి, ఇందిర, రఘు తదితరులు పాల్గొన్నారు.

మిగతా భాషల్లోనూ ప్రావీణ్యం అవసరం

- ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి.ఫజులుర్ రహమాన్

కర్నూలు కల్చరల్: మాతృభాషతో పాటు ఇతర భాషలపై కూడా ప్రావీణ్యం సాధించుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, ప్రొఫెసర్ పి.ఫజులుర్ రహమాన్ అన్నారు. బుధవారం వర్సిటీ ఉర్దూ శాఖ, ముహిబ్బానే ఉర్దూ ఆధ్వర్యంలో ఒక రోజు జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంగ్ల విద్య ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తుండటంతో మాతృభాషలో అభ్యసించేందుకు నేటి తరం విద్యార్థులు ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో మాతృభాష ఉనికి కోల్పోయే పరిస్థితిలో ఉందన్నారు. ఉర్దూ అభివృద్ధికి దేశంలో వివిధ ప్రాంతాల్లో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు ఆజ్రా జావేద్ మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ హక్ జయంతి సందర్భంగా జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి సదస్సులు భాషాభివృద్ధికి, లోతుగా పరిశోధనలు జరిపేందుకు ఉపయోగపడతాయన్నారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ ఎస్. అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ మాతృభాషలో పరిశోధనలు చేసేందుకు విద్యార్థులను ప్రోత్సహించక పోవడంతో ఉర్దూ భాష అంతగా అభివృద్ధి చెందడం లేదన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు మాట్లాడుతూ వర్సిటీలో ఉర్దూ భాష అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, హఫీజ్ ఖాన్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మొయిజ్ ఖాన్, అంజుమన్ ఇస్లామియా కరస్పాండెంట్ డాక్టర్ అమీర్ అహ్మద్, ఉర్దూ శాఖ సమన్వయకర్త డాక్టర్ జేఎండీ షఫీ, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్ఎస్ఎం హుస్సేని, ముహిబ్బానే ఉర్దూ సభ్యులు డాక్టర్ అంతు రహీం, డాక్టర్ నజీర్ అహ్మద్, ఇన్‌చార్జ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జహనారా, తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న ఉర్దూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.ఫజులుర్ రహమాన్, పాలక మండలి సభ్యులు

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
- అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు
- పెద్దకడబూరు మండలంలో ఘటన



రోదిస్తున్న జయలక్ష్మి కూతురు, కొడుకులు





మరణించిన జయలక్ష్మి (ఫైల్) హంతకుడు నాగేష్

పెద్దకడబూరు : కట్టుకున్నవాడే ఆమె పాలిట కాలయముడయ్యాడు. కలకాలం తోడుగా ఉంటానని ప్రమాణం చేసి చివరికి గొడ్డలితో నరికి ప్రాణాలు తీశాడు. ఈ విషాద సంఘటన పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన యల్లప్ప కుమార్తె జయలక్ష్మి(35)కి పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన నాగేష్‌తో 15సంవత్సరాల క్రితం పెళ్లి అయింది. ఈ దంపతులకు కూతురు ఇంద్రజ (12), కుమారులు ఈరన్న(11), బీరప్ప(6) ఉన్నారు. రోజూ మాదిరిగానే పొలం పనులకు వెళ్లి వచ్చిన జయలక్ష్మి మంగళవారం రాత్రి పిల్లలతో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. బయట వాళ్ల అవ్వ వద్ద పడుకున్న కుమార్తె ఇంద్రజ ఉదయం లేచి ఇంట్లోకి వెళ్లింది. గదిలో రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని చూసి గట్టిగా కేకలు వేసింది. ఇరుగుపొరుగు వెంటనే లోపలికి వచ్చి విగతజీవిగా పడి ఉన్న జయలక్ష్మిని చూసి నాగేష్‌ను నిలదీశారు. తన మాట విననందుకు గొడ్డలితో నరికి చంపానంటూ సమాధానం ఇవ్వడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం చేరవేశారు. సీఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని చేరుకొని చిన్నారులతో మాట్లాడారు. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. పనికి వెళ్లకుండా రోజూ తాగివచ్చి తన కుమార్తెను వేధించేవాడని, చివరకు ప్రాణాలే తీశాడని మృతురాలి తండ్రి యల్లప్ప కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయన ఫిర్యాదు మేరకు నాగేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శివరాము తెలిపారు. కాగా నాగేష్ కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించే వాడని గ్రామస్తులు తెలిపారు.

బోరున విలపించిన పిల్లలు

రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని చూసి పిల్లలు బోరున విలపించారు. అమ్మా లే అమ్మా అంటూ వారు పిలవడం చూసిన స్థానికుల కళ్లు చెమ్మగిల్లాయి. తండ్రి చేసిన దారుణానికి తల్లిని కోల్పోయి ఆ ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు.

నల్లమలలో రెండు లారీలు ఢీ



ప్రమాద దృశ్యం

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని రామయ్యకుంట బేస్ క్యాంప్ సమీపంలో రోళ్లపెంట ఘాట్ ఎక్కుతున్న లారీ దోర్నాల వైపు నుంచి ఘాట్ దిగుతున్న లారీ బుధవారం నేరుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీల డ్రైవర్లు ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. కాగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆత్మకూరు ఎస్ఐ నారాయణరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ పునరుద్ధరించారు.

లిఫ్ట్ పేరుతో బంగారం దోచేశాడు

- సకాలంలో స్పందించిన పోలీసులు
- అదుపులో నిందితుడు

జోన్ టౌన్: రోడ్డుమీద వెళ్తున్న వృద్ధురాలిని లిఫ్ట్ ఇస్తానని బైకుపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బంగారం దోచుకుని ఉడాయించిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వెంకటాపురం సర్కిల్ సమీపంలోని ఓ వెంచర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి పట్టణంలో నివాసం ఉండే కూతురు ఇంటికి బయలుదేరింది. జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన సర్వీసు రోడ్డులో కాలినడకన వెళ్తుండగా గుర్తుతెలియని దుండగుడు బైక్ ఆపి టౌన్‌లో దించుతానంటూ ఎక్కించుకున్నాడు. వెంకటాపురం రోడ్డు వైపు తిప్పి సుంకలమ్మ గుడి సమీపంలో ఉన్న వెంచర్‌లోకి తీసుకెళ్లి మహిళ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కున్నాడు. చెవి కమ్మలు కూడా బలవంతంగా లాక్కుంటుండగా వృద్ధురాలు గట్టిగా కేకలు వేసింది. సమీపంలోని రైతులు అక్కడికి చేరుకునేలోగా నిందితుడు బైకుపై ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జాతీయ రహదారిపై సీసీ ఫుటేజ్‌ల ద్వారా నిందితుడు దొరపల్లె గ్రామానికి చెందిన నరేంద్రగా గుర్తించి బుధవారం ఫోన్ లొకేషన్ ద్వారా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





గండ్లేరు రిజర్వాయరు గేట్ల వద్ద పైపుల ద్వారా పారుతున్న నీరు, రిజర్వాయరులో నీటి మట్టం తగ్గడంతో బయట పడిన రాళ్లు

యథేచ్ఛగా జల చౌర్యం

- గాలి పైపుల ద్వారా నీరు తరలింపు
- గండ్లేరు రిజర్వాయరులో తగ్గిపోతున్న నీటి మట్టం
- పొంచి ఉన్న తాగు నీటి సమస్య
- పట్టించుకోని తెలుగుగంగ అధికారులు



హరినగరం సమీపంలో దోన్ల వాగులో దిగువకు పారుతున్న నీరు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు(తుండ్లవాగు) జలాశయంలో నుంచి నీటి చౌర్యం యథేచ్ఛగా సాగుతోంది. గేట్ల అడుగు భాగాన 22 గాలి పైపులు అమర్చి రిజర్వాయరులో నుంచి నీటిని బయటకు తోడేస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ తంతు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అసలే ఎండలు మండుతున్నాయి. ఆ ఎండలకు నీరు ఆవిరి అవు తోంది. మరో వైపు రుద్రవరం మండలం తిమ్మనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు 24 గంటల పాటు నిరంతరం పైపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. దీంతో రిజర్వాయరులో నీటి మట్టం అడుగంటింది. ఇప్పటికే అక్కడక్కడా బయలు ప్రదేశాలు బయట పడ్డాయి. నిరంతరం నీరు తరలిపోతే కొద్దిరోజుల్లోనే రిజర్వాయరు ఖాళీ అయ్యే ప్రమాదముంది. అదే జరిగితే ఆళ్లగడ్డ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మరో 40 గ్రామాల ప్రజలు తాగు నీటి సమస్యతో అలమటించే ప్రమాదముంది. గండ్లేరు జలాశయం నుంచి నిత్యం రెండు మోటార్లతో నీటిని మండల పరిధిలోని హరినగరం ఎస్ఎస్ ట్యాంకుకు తరలించి అక్కడ శుద్ధి చేసి ఆళ్లగడ్డ పట్టణంతో పాటు మరికొన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. నీటి చౌర్యం వల్ల నీరు పంపింగ్ చేసేందుకు అందకపోవడంతో మోటార్లను మరి కొద్ది దూరం నీటిలో అమర్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా తెలుగుగంగ, ఆళ్లగడ్డ మున్సిపల్ శాఖ అధికారులు మేల్కొనకపోతే తాగు నీటి సమస్య జటిలమయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి చౌర్యం విషయంపై తెలుగుగంగ ఈఈ శంకర్‌రెడ్డిని వివరణ కోరగా ఇదివరకే గేట్ల వద్ద అమర్చిన గాలి పైపులను రెండు మార్లు ధ్వంసం చేయించానని, అయిన వారిలో మార్పు రాలేదని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు కూడా ఏమీ పట్టించుకోలేదని వివరణ ఇచ్చారు.